# కర్ఫ్యూ

కర్ఫ్యూ.....

కర్ఫ్యూ..... కర్ఫ్యూ.....

స్తంభించిపోయిన ప్రజాజీవనం...

కొట్లాటలతో... కత్తిపోట్లతో... హత్యలతో... ముఠా తగాదాలతో... భయానకస్థితి ఏర్పడ్డ సిటీ... ప్రస్తుతం కర్ఫ్యూనీడలో నిద్రిస్తోంది.

పోలీసువాహనాలు తప్పించి వీధుల్లో మనుష్యసంచారంలేదు.

మూతపడిన దుకాణాలతో... మూసేసిన కార్యాలయాలతో... సిటీ అంతటా నిశ్శబ్దం తాండవిస్తోంది.

సిటీబస్సుల రణగొణధ్వని మచ్చుకైనా విన్పించటం లేదు.

క్షణ క్షణం... భయం... భయం!. మతకలహాల పేరిట మారణహోమం... ప్రజాజీవనంలో అశాంతి... ఆందోళన... దౌర్జన్యకర సంఘటనలు... పోలీసుల లాఠీఛార్జి... గాలిలోకి తుపాకీ కాల్పులు...

విద్యాలయాలకి నిరవధికంగా శలవు ప్రకటించారు.

కూలీ నాలీ జనానికి రెక్కాడటం కష్టమైపోయింది.

ఇలాంటి దారుణమైన దయనీయమైన పరిస్థితుల్లో సైతం...

శరత్ అహర్నిశం డ్యూటీ చేస్తున్నాడు.

రాత్రిలేదు... పగల్లేదు... తిండిలేదు... నిద్రలేదు...

డ్యూటీ... డ్యూటీ... డ్యూటీ!!!

ఇంటిముఖం చూచి రెండురోజులైంది శరత్.

పోలీసు ఆఫీసరైనందుకు... విధినిర్వహణే ధ్యేయం!

పదేపదే... నీరజ గుర్తొస్తోంది!

నీరజ వట్టిమనిషికూడా కాదు. ఏ క్షణాన్నయినా పురుడు రావచ్చు!

నీరజను ఆస్పత్రికెవరు తీసుకెళతారు? ఎలా తీసుకెడతారు... ? ఆమెకేమైనా ప్రమాదం సంభవిస్తే... ?

అమ్మో!...

అయినా... తాను కర్తవ్యాన్ని నిర్వహించక తప్పదు.

చచ్చిపోయిన తల్లి గుర్తుకొచ్చింది. అమ్మ బ్రతికివున్నట్టయితే... నీరజకి తోడుగావుండేది. తాను కంగారుపడాల్సిన అవసరం వుండి వుండేది కాదు.

ప్రతి క్షణం నీరజ తనకోసమే ఎదురుచూస్తూంటుంది.

పాపం నీరజ!... తనను జీవితభాగస్వామిగా ఎన్నుకుని ఏం సుఖపడుతోంది?

★★ ★★ ★★

తులసికోట దగ్గర నిలబడి కళ్ళార్పకుండా కసరత్ చేస్తున్న శరత్‌నే చూస్తోంది నీరజ.

చమటపట్టిన శరత్ శరీరం నీరెండలో నిగనిగ మెరుస్తుంది.

''బావా!... నిన్ను చూస్తుంటే నాకేమన్పిస్తోందో తెల్సా?'' చిలిపిగా అంది నీరజ.

'' ఏమన్పిస్తోంది?'' బస్కీలు తీస్తూనే అడిగేడు శరత్.

''ఇలాచీ బిస్కెట్‌లాగ కరకర కొరుక్కుతినేయాలన్పిస్తోంది...'' నీరజ పకపకా నవ్వింది.

''ఛీనోర్ముయ్... నీ కళ్ళసలే మంచివి కావు... లోపలికెళ్ళు... '' గదిమేడు శరత్.

''నీక్కాబోయే పెళ్ళాన్నికదా... నీకా భయం అక్కర్లేదు... ''

''సర్లే... ఇంట్లోకెళ్ళి... ఓ గ్లాసు పాలు పట్రా...''
గెంతుకుంటు ఇంట్లోకెళ్ళింది నీరజ.

''అత్తయ్యా!... బావకి పాలు కావాలిట... తెమ్మన్నాడు...''

''అదిగో... ఆ గ్లాసులో పోసి మూత పెట్టి వుంచాను, పట్టుకెళ్ళి ఇవ్వు...'' మరోపనిలో మునిగి పోయిన సీతమ్మ అంది.

గుప్పెట్లోవున్న బాదంపప్పు ఒక్కొక్కటిగా నోట్లోవేసుకుని నములుతున్నాడు శరత్.

''ఇదిగో పాలు...'' గ్లాసు అందించింది నీరజ.

''అక్కడపెట్టి వెళ్ళు...''

'వెళ్ళను... ఇక్కడే... నీ ఎదురుగానే వుంటాను...''

'నేను స్నానం చెయ్యాలి...''

''సున్నిపిండితో వీపు రుద్దేదా?''

''ఛీపో... సిగ్గులేనిదానా...!''

వంటింటి కిటికీలోంచి బావా మరదళ్ళ సరసాన్ని చూచి నవ్వుకుంది సీతమ్మ.

తల్లీతండ్రీ తానే అయి పదేళ్ళ శరత్‌ని పెంచి పెద్దచేసింది. తనను వంటరి చేసిపోయినందుకు భర్తని ఏనాడు నిందించలేదు. వంశాంకురాన్ని... ఒక ప్రతిరూపాన్ని ఇచ్చినందుకు... గుండెరాయి చేసుకుని సంతోషించింది.

స్థిరచరాస్తులంటూ ఏమీ లేపోయినా... డిపార్ట్‌మెంట్‌వారిచ్చిన డబ్బుతో జీవితం వెళ్ళతీస్తూ... శరత్‌మీదే ఆశలు పెంచుకుని... రోజులు... సంవత్సరాలు గడిపింది సీతమ్మ.

చేతికి అందొచ్చిన కొడుకుని చూచుకుని మురిసిపోతోంది.

చదువులో... ఆటల్లో... అన్నింటిలోనూ ముందుంటాడు శరత్!.

హైస్కూల్లో చదివే రోజుల్లోనే 'బాడీబిల్డింగ్' పోటీలో మెడల్సు సంపాదించాడు. కాలేజీలో చేరాక... వరుసగా ప్రతి ఏడూ 'మిస్టర్ కాలేజ్' బిరుదు శరత్‌కే దక్కింది.

తానొక పోలీసు ఆఫీసరు కావాలనేది శరత్ లక్ష్యం!

''కొడుక్కి పెళ్ళి చెయ్యవా ఏమిటే సీతా...?'' చెల్లెలు ముఖంలోకి చూస్తూ అడిగేడు రాజారావ్...

రాజారావ్ అదేవూళ్ళో... పాతికేళ్ళుగా ప్లీడరుగుమస్తా పని చేస్తున్నాడు. కాస్తో కూస్తో సంపాదించి వెనకేశాడు.

ఒక్కగానొక్క సంతానం!

నీరజ భూమ్మీద పడ్డప్పటినుంచీ శరత్‌కి పెళ్ళాంపుట్టిందనేసి అనుకుంటూ చెల్లెలితో బంధుత్వాన్ని కలుపుకుని... వియ్యమందాలనే వుబలాటం రాజారావ్‌లో వుంది.

అన్నయ్య ఆలోచనలు పసికట్టిన సీతమ్మ అందుకు అభ్యంతరం చెప్పటానికి సాహసించనూలేదు.

''ఏమిటి సీతమ్మా, నీ ఆలోచన?... నా ప్రశ్నకి జవాబు చెప్పలేదు...'' మళ్ళా రాజారావే అన్నాడు.

''వాడికేదైనా వుద్యోగంరానీ అన్నయ్యా!...''

చెల్లెలి జవాబు సబబుగానే తోచింది. అయినా వుండబట్టలేక-

''అదికాదే... నీ కొడుక్కి వుద్యోగం ఎంత అవసరమో... నా కూతురిరి పెళ్ళి అంత ముఖ్యం...'' అన్నాడు.

''నాదేముంది అన్నయ్యా?... వాడినే అడుగు...'' అప్పుడే అక్కడి కొచ్చిన శరత్‌ని చూస్తూ అంది సీతమ్మ.

''ఏమిటి మామయ్యా!... నీరజ పెళ్ళిగురించేనా?... మంచి మొగుడ్ని వెతికి మూడు మూళ్ళూ వేయించెయ్...'' తమాషాకి అన్నాడేకాని శరత్ కళ్ళు నీరజకోసం వెతుకుతున్నయ్.

రాజారావ్ గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయింది.

''అదేమిట్రా?... నీరజను నీకిచ్చి పెళ్ళి చేద్దామని మామయ్య అనుకుంటుంటే...'' సీతమ్మ నిజంగానే కంగారుపడ్డది.

'' ఈ వస్తాదుని నేను అసలు పెళ్ళి చేసుకోనులే నాన్నా!...'' అప్పటివరకు తలుపు వెనగ్గావుండి సంభాషణ అంతా వింటున్న నీరజ తండ్రి ముందుకొస్తూ బావని వుడికించాలనే వుద్దేశంతో అంది.

''నువ్వక్కడికి మహారాజాగ్గా వున్నావ్...''

పక్కనేవున్న శరత్ నీరజనెత్తిన మొట్టికాయ వేశాడు.

''ఓరి మీ సరసం బంగారం కానూ...'' ముక్తకంఠంతో అన్న రాజారావ్ సీతమ్మ ఒకరిముఖాలొకరు చూచుకుని నవ్వుకున్నారు.

''మామయ్యా!... నీకో గుడ్‌న్యూస్ చెప్పనా?...''

శరత్‌కేసి విస్మయంగా చూచి ''వున్న పళంగా పెళ్ళిచెయ్యమంటావా ఏమిట్రా?...'' ఎగతాళిగా అన్నాడు రాజారావ్.

''నాకు వుద్యోగం వచ్చింది...''

''శరత్!... ఏమిట్రా నువ్వంటున్నది?... నిజంగానా?!...'' ఆశ్చర్యాన్ని సంబరాన్ని ప్రకటించింది సీతమ్మ.

''అవునమ్మా!... వెంటనే ట్రయినింగ్‌లో జాయిన్ కమ్మని ఇప్పుడే లెటరొచ్చింది...''

''ఏం వుద్యోగంరా అది?... ఏదైనా పెద్ద వుద్యోగమేనా?'' శరత్ ముఖంలోకి ఆశగా చూస్తూ అడిగేడు రాజారావ్.

బావకి వుద్యోగం వచ్చినందుకు ఎగిరి గంతేసింది నీరజ.

''పోలీసు డిపార్ట్‌మెంట్‌లో యస్.ఐ పోస్టుకి సెలక్ట్‌య్యానమ్మా!...'' దగ్గరగావచ్చి నిలబడి తల్లితో చెప్పాడు.

శరత్ మాటల్లో దర్జా,ఠీవి వుట్టిపడ్డయ్.

'' ఇంకేం... మీ నాన్న పోలికే నీకూ వచ్చింది...''

మేనమామ మాటల్ని పట్టించుకోకుండా తల్లి ముఖంలో వచ్చిన మార్పుని గమనించాడు శరత్.

''నాకు వుద్యోగం వచ్చినందుకు సంబరపడాల్సింది పోయి...ముభావంగా వున్నావేం అమ్మా?...''

''బాబూ శరత్! ఈ వుద్యోగం నీకొద్దు... నా మాట విని వేరే ఇంకేదైనా మంచి వుద్యోగం చూసుకో...''

సీతమ్మ కంఠం జీరబోయింది. కళ్ళలో నీరు తొణికిసలాడింది. భయంతో మనిషి వణికిపోతుంది.

''ఏమిటే సీతా, నీ పిచ్చి?... కాళ్ళదగ్గర కొచ్చిన వుద్యోగాన్ని వదులుకోవటమా?- లక్షలు కుమ్మరించినా ఈ వుద్యోగం దొరకటం కష్టంగా వుంది ఈ రోజుల్లో...'' రాజారావ్ కల్పించుకు మాట్లాడాడు.

''నా బాధ నీకు అర్థంకాదులే అన్నయ్యా!... ఖాకీ గుడ్డల వుద్యోగమే ఒకప్పుడు నా పసుపు కుంకుమల్ని తుడిపేసింది... మళ్ళీ... నా కడుపున పుట్టిన బిడ్డని అదే ఖాకీ గుడ్డల్లో చూడలేను... ఆ బాధ భరించలేను...'' కళ్ళొత్తుకుంది సీతమ్మ.

★★ ★★ ★★

పదహారేళ్ళయినా నిండకముందే సీత పెళ్ళి పాపారావ్‌తో జరిగిపోయింది.

అప్పటికే రెండేళ్ళ పోలీసు డిపార్టుమెంట్‌లో కానిస్టేబులు వుద్యోగం చేస్తున్నాడు పాపారావ్...

పోలీసు యూనిఫారంలో క్రమశిక్షణ వుందని నమ్మిన వ్యక్తి పాపారావ్. ఉద్యోగంలో చేరింది మొదలు నీతి నిజాయితీకి మారుపేరుగా మంచిపేరు తెచ్చుకున్నాడు పాపారావ్.

పాపారావ్ నడవడిక అలవాట్లు సిన్సియారిటీ గుర్తించిన డిపార్ట్‌మెంట్ 'ఉత్తమ పోలీస్' అవార్డు ఇచ్చి సత్కరించింది.

పాపారావ్‌కి లంచం అంటే పరమ అసహ్యం! డిపార్ట్‌మెంట్‌లో సాటివారి అవహేళనకు గురైనా వాళ్ళమాటల్ని లక్ష్యపెట్టలేదు.

ఉద్యోగాన్నే దైవంగా ఆరాధించేడు.

శరత్ కడుపున పడగానే ప్రమోషన్ వచ్చింది. అందుకు పొంగిపోయాడు పాపారావ్.

యస్సైగారింట్లో దొంగతనం జరిగిన కేసు దర్యాప్తుకి పాపారావ్ ముందుకొచ్చింది.

తన శక్తి యుక్తులతో... తెలివితేటల్తో... వారం తిరక్కుండే దొంగలముఠాని పట్టుకున్నాడు.

పేరుమోసిన దొంగలముఠాని పట్టుకున్నందుకు అధికారులు పాపారావ్‌ని అభినందించారు. ప్రభుత్వం తరఫునుండి 'క్యాష్ అవార్డు' కూడా లభించినందుకు పొంగిపోయాడు పాపారావ్.

ఇల్లు పట్టకుండా ఎప్పుడూ విధి నిర్వహణే ధ్యేయంగా పెట్టుకు తిరిగే భర్తని చూచి సీతమ్మ ఏనాడూ మనసు కష్టపెట్టుకోలేదు. బాధపడనూలేదు.

పేరు ప్రతిష్టలు సంపాదించుకునే పాపారావ్‌వంటి వుత్తముడు తనకు భర్తగా లభించినందుకు గర్వించేది.

ఒకసారి...

స్పెషల్ డ్యూటీమీద వెళ్ళాల్సి వచ్చిందని ... వారం రోజుల్లో తిరిగొస్తానని చెప్పి బయల్దేరి వెళ్ళాడు పాపారావ్.

బయల్దేరిన పోలీస్ వేన్‌లో యస్సైతోపాటు పాపారావ్... మరో నలుగురు కానిస్టేబుల్సూ వున్నారు.

సంఘవ్యతిరేక శక్తుల్ని పట్టుకోవాలనే ఆశయంతో బయల్దేరేరు.

అంతే...

మందుపాతర పేలిన కారణంగా వేన్‌లో ప్రయాణిస్తున్నవారంతా మృత్యువాత పడ్డారనే నిజం తెల్సిన క్షణంలో... సీతమ్మ గుండెచప్పుడు ఆగిపోయినట్టయింది.

గుండెలవిసేలా ఏడ్చింది! తండ్రిలేని శరత్‌ని గాఢంగా హృదయానికి హత్తుకుంది.

★★ ★★ ★★

పైటకొంగుతో కళ్ళొత్తుకుని ''బాబూ శరత్!... నువ్వీవుద్యోగంలో చేరి

నూరేళ్ళ బ్రతుకును బగ్గిపాలు చేసుకోవద్దురా... నా మాట విను...'' ప్రాధేయపడింది.

''అమ్మా!... నీ ఆవేదనకి కారణం నాకు తెల్సు - నాన్నగారు దురదృష్టవశాత్తు అకాలమరణానికి గురయినంత మాత్రాన నేను బరువుగా ఆలోచించటం అవివేకం!'' నచ్చచెప్పబోయాడు శరత్.

''అవునే సీతా!... పోలీసు డిపార్ట్మెంట్లో వుద్యోగం అంటేనే... కత్తిమీద సాము లాంటిది - అందరూ నీకుమల్లే పిరికిగా ఆలోచిస్తే... ఈ దేశం గతేంకాను? '' చెల్లెలికి ధైర్యాన్ని నూరిపోసే ప్రయత్నంలో తనకు తోచింది చెప్పాడు రాజారావ్.

''అదే డిపార్ట్మెంట్‌లో చేరబోతున్న నేను నాన్నగారు సంపాదించిన పేరు ప్రతిష్టలును కాపాడతానమ్మా! ఏం భయంలేదు. అనవసరంగా ఆలోచించి మనసు పాడుచేసుకోవద్దు...'' వుద్వేగంతో మాట్లాడేడు శరత్.

తన మాట కాదని అదే రోజు ట్రయినింగ్‌కి బయల్దేరిపోతున్న శరత్‌ని వారించలేని తన నిస్సహాయస్థితికి బేలగా వుండిపోయింది సీతమ్మ.

★★ ★★ ★★

జీపు పక్కగా నిలబడి, 'స్టేట్మెంట్' చేయించుకుంటున్నాడు శరత్.

స్నానం చేసి మూడురోజులైంది. వంటినవున్న యూనిఫారం చెమటతో తడిసి పోయి కంపు కొడుతోంది.

కానిస్టేబుల్ తెచ్చిపెట్టిన టిఫిన్ చేసి మళ్ళీ జీపెక్కేడు.

కర్ఫ్యూ ప్రాంతంలో మళ్ళీ పెట్రోలింగ్ మొదలైంది.

మళ్ళీ నీరజగుర్తొచ్చింది. ఇంట్లో వంటరిగా ఎట్లావుందో ఏమో?...

''సార్!... మీరొకసారి ఇంటికివెళ్ళిరాకూడదూ?'' వెనకగా కూర్చున్న పోలీసు కానిస్టేబుల్ పరామర్శగా అన్నాడు.

'వెళ్ళాలనే నాకూ వుంది - యస్.పి పర్మిట్ చెయ్యలేదు. ఏం చేస్తాం?... డ్యూటీ ఫస్ట్...'' నిరుత్సాహంగా మాట్లాడేడు శరత్.

''మన జీవితాలు ఇంతే సార్!... కన్నవాళ్ళూ... కట్టుకున్నవాళ్ళూ హరీ అన్నా... వెళ్ళి చూడటానికీ డ్యూటీ అడ్డమొస్తుంది... ''

కానిస్టేబులు కామెంటు శరత్ గుండెలో ముల్లులా గుచ్చుకుంది.

అంతలోనే తనను తాను సంబాళించుకుని ధైర్యం తెచ్చుకున్నాడు.

''ఈ కర్ఫ్యూ త్వరగా ఎత్తేస్తే బావుండు...'' నిస్సారంగా మాట్లాడేడు మరో కానిస్టేబులు.

''ఇంటివేపు గాలి మళ్ళిందా?...'' శూన్యంలోకి చూస్తూ అన్నాడు శరత్.

''అవును సార్! - నేను డ్యూటీలోకొచ్చేటప్పటికి నా కొడుక్కి నూటనాలుగు డిగ్రీల జ్వరం - ఇప్పుడెట్లా వున్నాడో ఏమో... ''

''డోన్ట్‌వర్రీ... ఎవరిథింగ్ విల్ బి ఆల్‌రైట్...'' ధైర్యాన్ని నూరిపోశాడు శరత్.

జీపు వీధుల్లో పచార్లు చేస్తోంది.

సిటీలో టెన్షన్ కొంచెం కొంచెంగ సద్దుమణిగింది.

అయినా ముందుజాగ్రత్తచర్యగా కర్ఫ్యూ కొనసాగుతోంది.

అప్పటికి అర్ధరాత్రి పన్నెండుగంటలైంది.

రోడ్డు పక్కగా ఆగివున్న జీపులో శరత్ కునికిపాట్లు పడుతున్నాడు. బద్ధకం మనిషిని ఆవహించింది. వెనుక సీట్లోవున్న సిబ్బందికూడా జోగుతున్నారు.

నలుగురు సాయుధులైన దుండగులు చీకట్లో నక్కుతూ వచ్చి జీపుమీద దాడి చేశారు.

శరత్‌తోపాటు అంతా మేలుకున్నారు.

పరిస్థితి అర్ధమైంది...

దారుణ మారణకాండకు తలపడ్డ సంఘవిద్రోహశక్తుల చేతుల్లో ఓటమిని అంగీకరించాల్సిన పరిస్థితి ఎదురైంది.

అయినా, శక్తినంతా కూడదీసుకున్న శరత్ కాని, పోలీసుబలగం దుండగులతో తలపడ్డారు.

సంఘవిద్రోహశక్తుల కరకుకత్తులు జీపులో వారినందరినీ మట్టుపెట్టినయ్. నీరజనే కలవరిస్తూ శరత్ ఆఖరిశ్వాస విడిచాడు.

---

★ *(10-3-93 పల్లకి వారపత్రికలో ప్రచురితం)*